క్లుప్తంగా

శరవేగంగా నల్గొండమ్మతల్లి ఆలయ నిర్మాణం



మెట్టపై నిర్మిస్తున్న నల్గొండమ్మతల్లి ఆలయం

తుని రూరల్: ఎస్.అన్నవరం వేంపాడు మెట్టపై నల్గొండమ్మతల్లి ఆలయ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం కొండ దిగువున పూర్వం నిర్మించిన ఆలయంలో అమ్మవారికి పూజా కైంకర్యాలు, జనవరిలో తీర్థం, అమ్మవారికి భోనాలు సమర్పిస్తున్నారు. ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య, భోనాలు సంఖ్య పెరుగుతుండడం, భక్తుల రద్దీకి అనువుగా నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విశాలంగా నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. నూతన ఆలయంలో నల్గొండమ్మతల్లి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, 2026 సంవత్సరంలో అమ్మవారికి భోనాలు సమర్పించేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు. అభివృద్ధి కమిటీ, దాతల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు.

సాయిసందీప్‌కు విశిష్ట సేవా రత్న పురస్కారం



సాయిసందీప్‌కు పురస్కారం అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

ఏలేశ్వరం: మండలానికి చెందిన స్పార్క్ చైర్మన్ సాయిసందీప్ ఆదివారం విశిష్ట సేవా రత్న పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవరంలో మేడిది సుబ్బయ్య ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండర్ మేడిది వెంకటేశ్వర రావు చేతుల మీదుగా సాయిసందీప్ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న స్పార్క్ చైర్మన్ సాయిసందీప్‌కు పురస్కారం అందజేశామన్నారు. సాంకేతిక రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో స్పార్క్ సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మేరీమాత యాత్ర మహోత్సవాలు

ప్రత్తిపాడు: స్థానిక మరియగిరిపై ఆదివారం మేరీమాత యాత్ర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పరంజ్యోతి పతావిష్కరణ చేయగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ జ్యోతి ప్రజ్వలన చేసి, మహోత్సవాలను ప్రారంభించారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ చిన్నప్పతో పాటు వివిధ చర్చిల ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటకాలు

ప్రత్తిపాడు: స్థానిక సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి ప్రదర్శించిన పౌరాణిక నాటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొలుత షణ్ముఖి నాట్యమండలి వారు 'శ్రీరామాంజనేయ యుద్ధం' నాటకంలోని యుద్ధం సన్నివేశాన్ని ప్రదర్శించారు. గానగంధర్వ షణ్ముఖి విజయకుమార్ రాజు శ్రీరామునిగా, విజయనగరానికి చెందిన కెపి రాజు ఆంజనేయుని పాత్రలో మెప్పించారు. అనంతరం 'సత్య హరిశ్చంద్ర' నాటకంలోని కాటి(శ్మశాన) సన్నివేశాన్ని ప్రదర్శించారు. విజయనగరానికి చెందిన ఫలగాని ఫణికుమార్, మహంతి రమణలు హరిశ్చంద్ర, చంద్రమతి పాత్రల్లో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఎ.బాలసుబ్రహ్మణ్యం, సుబ్రహ్మణ్యంలు హార్మోనియం, డోలక్ వాయిద్య సంగీతాన్ని అందించారు. కాగా సత్తెమ్మతల్లి అమ్మవారిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం



కట్టా సూర్యప్రకాశరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పట్టణంలో ఆదివారం కట్టా సూర్య ప్రకాశరావు మాస్టారు ఉద్యోగ విరమణ ఫంక్షన్‌కు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువును భగవంతుని పోలుస్తారని అంతటి గౌరవ మర్యాదలు ఉపాధ్యాయులకే ఉందన్నారు. ఎంపీపీ గొల్లపల్లిబుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్, జట్ల సోమరాజు, జి సుందర రావు, తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు తంటికొండ వెంకన్న

- నేటి నుంచి 65వ దివ్య బ్రహ్మోత్సవాలు
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండ. (అంతర చిత్రం) ఆలయంలో కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి



కొండపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయం



వెంకటగిరి కొండపై స్వామి వారి నిజపాదముద్ర

గోకవరం: తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయం 65వ దివ్య బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యింది. సోమవారం నుంచి 7వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. 1961వ సంత్సరం నుంచి ఇక్కడ బ్రహ్మోత్సవాలు ఏటా నిర్వహిస్తున్నారు. స్వామి వారి మహిమపై ఒక కథ ప్రచారంలో ఉంది.

స్థానిక ఐతిహ్యం ప్రకారం గ్రామంలోని కొండ మీద దివ్యతేజస్సు కనిపించేది. దూరం నుంచే ఈ తేజస్సును చూసి గ్రామస్తులు నమస్కరించేవారు. తదనంతరం కొంతమంది యువకులు ధైర్యం చేసి కొండపై గాలించగా దివ్యతేజస్సుతో అలరారుతున్న పాదముద్ర కనిపించింది. దీంతో అప్పటి నుంచి గ్రామస్తులు ఈ పాదముద్రకు పూజలు నిర్వహించేవారు. అదే సమయంలో శ్రీమహావిష్ణువు ఓ భక్తుడి కలలో కనిపించి 'నారసింహుని అవతారంలో తాను ఈ కొండపై సంచరించానని, అప్పుడే ఈ పాదముద్ర పడిందని, ఈ ప్రాంతంలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని' తెలిపాడు. ఈ నిజపాద చిహ్నానికి పశ్చిమంగా వంద అడుగుల దూరంలో ఒక రాతిపై గోవు కాలి గుర్తు, దానికి సమీపంలో ఒక రాతిపై సర్ప చిహ్నం కూడా ఉండడంతో ఇక్కడ స్వామివారు స్వయంగా వెలసి, కోరిన కోర్కెలు తీరుస్తాడని భక్తుల విశ్వాసించారు. 1961 సంవత్సర మాఘశుద్ధ పంచమినాడు స్వామి వారి ఆలయాన్ని ప్రతిష్ఠించారు. క్రమంగా ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయ నిర్మాణంతోపాటు ఆంజనేయ, గోవిందరాజుస్వామి, అలివేలుమంగకు ప్రత్యేక ఆలయాలు నిర్మించారు. కొండకు పశ్చిమంగా కాలినడకన వెళ్లేందుకు మెట్లు, తూర్పువైపున కోనేరు ఉంది. కొండపైకి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో వాహనాలు వెళ్లేందుకు ఘాట్‌రోడ్డు నిర్మించగా ఇటీవల రూ.1.75 కోట్లతో ఘాట్‌రోడ్డును మొత్తం సీసీరోడ్డు, రక్షణగోడ నిర్మించారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని భక్తులంతా స్వామి వారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, ఈఓ వడ్డాది సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది విద్యార్థులకు, మహిళలకు పలు పోటీలు కూడా నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు.

పూజా కార్యక్రమాలు

3వ తేదీ ఉదయం ఆలయ ప్రదక్షిణ, స్వస్తివాచనం, స్వామివారి పాదసేవ, హారతి, సంకల్పం, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అకల్మష కూష్మాండ హోమం, 4న రథసప్తమి సందర్భంగా కొండపై గ్రామస్తులతో సామూహిక పాలు పొంగించే కార్యక్రమం, 5న సహస్ర దీపాలంకరణ సేవ, 6న ఉదయం గిరిప్రదక్షిణ, సాయంత్రం శ్రీలక్ష్మీ నారసింహ సహిత మహా సుదర్శన హోమం, 7న చక్రస్నానం, మహాపూర్ణాహుతి, 8న తెప్పోత్సవం, 9న గరుడసేవ, గ్రామోత్సవం.

ముద్రగడకు వైఎస్సార్ సీపీ నేతల సంఘీభావం



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన తోట నరసింహం

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం నివాసం ఆవరణలోకి జనసేన కార్యకర్త గనిశెట్టి గంగాధర్ ఆదివారం తెల్లవారు జామున ట్రాక్టర్‌పై వచ్చి బీభత్సం సృష్టించాడు. విషయం తెలుసుకున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, స్థానిక ఎస్సై జి.సతీష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. జరిగిన ఘటనపై ప్రత్తిపాడు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ముద్రగడ అభిమానులు భారీగా తరలి వచ్చి ముద్రగడ పద్మనాభంకు, గిరిబాబుకు సంఘీభావం తెలిపారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం, తోట రాంజీ, బదిరెడ్ల గోవిందు, ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీరాజు, డీఎంఆర్ శేఖర్, సుంకర విద్యాసాగర్, తదితరులు దాడులను ఖండించారు.

ముద్రగడ ఇంటిపై దాడికి ఖండన

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడికి పాల్పడడాన్ని పలువులు వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. టీడీపీ పాలనలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వారు ఆరోపించారు. ముద్రగడ నివాసంపై పాల్పడం దారుణమైన చర్య అని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కిర్లంపూడిలో ముద్రగడ నివాసంలో కలిసి, సంఘీభావం తెలిపారు. దాడిని ఖండించిన వారిలో ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, పార్టీ నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు, గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ తదితరులున్నారు.

చదువుల తల్లిగా నేడు తలుపులమ్మ



లోవలో చెట్లకింద వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: లోవ దేవస్థానంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మతల్లి వసంత పంచమి సందర్భంగా చదువుల తల్లి సరస్వతీదేవి అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు. సోమవారం అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ, సరస్వతీ హోమం, విశేష పూజలు ఏర్పాటు చేసినట్టు కార్య నిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఆదివారం తెలిపారు. అమ్మవారి పాదాల చెంత ఉంచి పూజలు చేసిన పెన్నులను పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశీర్వదిస్తూ విద్యార్థులకు మొదటిసారి అందజేయనున్నట్టు తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

రూ.2.72 లక్షల ఆదాయం

వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన మూడు వేల మంది భక్తులు ఆదివారం తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్టు ఈఓ తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, కాటేజీ అద్దెలు, విరాళాలు తదితర విభాగాలు నుంచి దేవస్థానానికి రూ.23.72,772 ఆదాయం లభించిందని ఈఓ విశ్వనాథరాజు తెలిపారు.

సీలింగ్ భూములకు పట్టాలివ్వాలి



శివరామపట్నంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం నాయకులు

గోకవరం: శివరామపట్నం గ్రామంలో గత రెండు దశాబ్దాలుగా నిరుపేదలు సాగు చేసుకుంటున్న 32 ఎకరాల సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. గ్రామంలో ఆదివారం రైతుకూలీలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ పేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్‌చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, నాయకులు డి.సురేష్, అర్జున్, జి.బాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న బాలికలు

ఏలేశ్వరం: పట్టణంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఆట పోటీలు ఆదివారంతో ముగిశాయి. పట్టణంలోని భాష్యం స్కూల్ ఆవరణలో ఇంట్రా సబ్‌జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఏలేశ్వరంతోపాటు తుని, పిఠాపురం, సామర్లకోట, జగ్గంపేట పరిధిలో స్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ గొల్లపల్లి అనిల్‌కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు బాలబాలికలకు పోటీలు నిర్వహించామని, రెండోరోజు బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్యారమ్స్, చెస్ పోటీలు జరిగాయన్నారు. కార్యక్రమంలో తుని, పిఠాపురం, జగ్గంపేట ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వేణు, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబర్చి బహుమతులు గెల్చుకున్న విద్యార్థులు

గోకవరం: రాజమహేంద్రవరంలో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో జూబ్లీ మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అబాకస్ ప్రతిభా పోటీల్లో తంటికొండలోని ఎస్ఎంఆర్, గోకవరంలోని విద్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు నాలుగు ర్యాంకులు సాధించారు. ఆయా స్కూళ్ల కరస్పాండెంట్ సారేపల్లి రామదుర్గా ప్రసాద్ మాట్లాడుతూ జూనియర్ విభాగంలో రెండో తరగతి చదువుతున్న ఎస్.ప్రవల్లికి మొదటి ర్యాంకు, నాలుగో తరగతి విద్యార్థి ఎస్.హేమశ్రీకు మూడో ర్యాంకు, సీనియర్ విభాగంలో ఏడో తరగతి విద్యార్థి వై.హర్షిత, జి.రాజిలకు రెండో ర్యాంకు సాధించారన్నారు.

తల్లిదండ్రులకు విద్యార్థుల అప్పగింత



తునిలో విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తుని: ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థులను పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. జనవరి 29న సాయంత్రం ఆరు గంటలకు పట్టణానికి చెందిన యడ్ల హేమంత్ వర్ధన్(14), ముచుపల్లి శ్యాంప్రసాద్(15) ట్యూషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. ఆ ఇద్దరు విద్యార్థులు హైదరాబాదులో ఉన్నట్లు గుర్తించి తుని పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. కౌన్సిలింగ్ అనంతరం విద్యార్థులను తల్లిదండ్రులకు అందజేశారు. హైదరాబాదు చూడాలనే కోరికతో ట్యూషన్ ఫీజు కట్టమని ఇచ్చిన డబ్బులతో హైదరాబాదు వెళ్లిపోయినట్టు పోలీసులు తెలిపారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పట్టణ పోలీసులు సూచించారు.

మర్రి చెట్టు కింద కొలువుదీరిన అమ్మవారు

రేపటి నుంచే అమ్మవారి జాతర ప్రారంభం





అమ్మవారి ఆలయం (అంతర చిత్రం) వీరమ్మ పేరంటాలు, శాంతి స్వరూపిణిగా కొలువుతీరిన అమ్మవారు, (మూలవిరాట్)

గండేపల్లి: నీలాద్రిరావుపేట శివారులో హైవేని ఆనుకుని ఉన్న గ్రామ దేవత వీరమ్మ పేరంటాలు అమ్మవారి 58వ వార్షికోత్సవ జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఆలయ నిర్వాహకులు జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

రథసప్తమి గడియల్లో అమ్మవారు అత్తారింటి కెళుతూ మార్గ మధ్యలో ఉన్న భర్తకు కష్టం రావడంతో మర్రివృక్షం కింద ధ్యానం చేశారు. దీంతో భర్త నయమైంది. భర్త కుదిటపడిన సంతోషంలో అమ్మవారు అక్కడే కొలువుదీరారు. అమ్మవారు వీరమ్మ పేరంటాలమ్మ గాను, శాంతి స్వరూపిణి గాను భక్తులకు దర్శనమిచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా భక్తుల నుంచి నిత్య పూజలందుకుంటున్నారు. 1968లో అమ్మవారికి పర్ణశాలను నిర్మించి, మట్టికలశాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించేవారు. 1994లో అమ్మవారి దివ్య మంగళ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఏటా రథసప్తమిలో జాతర నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 4న జరగనున్న జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకుడు సక్కా సత్తిబాబు తెలియజేశారు.

అరసవిల్లి పుణ్యక్షేత్రానికి సత్యదేవుని ప్రచార రథం

అన్నవరం: శ్రీకాకుళం జిల్లా అరసవిల్లిలోని సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మంగళవారం జరుగనున్న రథసప్తమి ఉత్సవాలకు అన్నవరంలోని సత్యదేవుని ప్రచార రథం బయలుదేరింది. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో ఈ రథం ఆదివారం సాయంత్రానికి అరసవిల్లి చేరుకుంటుంది. ఈ రథం సోమ, మంగళ వారాల్లో అక్కడే ఉండి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనంతోపాటు సత్యదేవుని ప్రసాదం కూడా భక్తులకు పంపిణీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

ఘనంగా సూర్యనమస్కారాలు



రత్నగిరిపై సూర్యనమస్కారాల పూజలు చేస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన ఆదివారం సూర్యనమస్కారాలు ఘనంగా నిర్వహించారు. సత్యదేవుని కళా వేదిక మీద సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, వివిధ భంగిమలలో నమస్కారాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితులు సూర్యనమస్కారాలు, వివిధ ఆసనాలు వేశారు. ఉదయం 11.30 గంటల వరకు ఈ పూజలు కొనసాగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

శంఖవరం: నెల్లిపూడి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు 120 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 20 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 20 మంది రోగులకు శుక్లాలు ఉండగా వారిని ఆపరేషన్ కోసం కాకినాడ పంపిచినట్టు తెలిపారు. బాబి,కరణం సుబ్రహ్మణ్యం,మేకల కృష్ణ,గొర్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలపై మంచు దుప్పటి..



మంచు దుప్పటిలో ప్రత్తిపాడు

అన్నవరం/ ప్రత్తిపాడు: పల్లెలను పొగ మంచు కమ్ముకుంది. ఉదయం 8.30 గంటలైనా సూర్యరశ్మి పుడమిని తాక లేదు. మంచు కారణంగా రోడ్లు కనిపించకపోవడంతో పనులకు వెళ్లేందుకు కూలీలు, పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. దట్టమైన పొగ మంచు కమ్ముకోవడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయం ఆదివారం తెల్లవారు నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు ఆలయం కనిపించలేదు. రత్నగిరిని కూడా తెల్లని మంచుతెర కప్పేయడంతో దేవస్థానంలో దీపాలు నక్షత్రాలుగా దర్శనమిచ్చాయి. సాధారణంగా రాత్రి వేళల్లో జాతీయ రహదారి మీద వివిధ వాహనాలలో ప్రయాణించే వారు, రైళ్లలో ప్రయాణించేవారు అన్నవరం రాగానే వారికి ఎదురుగా విద్యుత్ దీపాల వెలుగులో సత్యదేవుని ఆలయం కనువిందు చేస్తుంది. అయితే ఆదివారం తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచు కారణంగా ఆలయం కనిపించలేదు. మళ్లీ మంచు వీడిన తర్వాత ఆలయానికి చేరుకున్నారు. పొగమంచు కురవడం వల్ల మామిడి, జీడిమామిడి పంటల పూత రాలిపోతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మంచుతెర ముసుగులో ఉన్న సత్యదేవుని ఆలయం



ఉదయం ఎనిమిది గంటల తర్వాత దర్శనమిచ్చిన ఆలయం



ప్రత్తిపాడు పాత కోర్టు భవనం వద్ద

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



నీలాపు రాంబాబు (ఫైల్)

గండేపల్లి: మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందినట్టు గండేపల్లి హెచ్‌సీ రమణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... తాళ్లూరుకు చెందిన నీలపు రాంబాబు(37) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకువెళ్లి రాలేదు. ఆదివారం ఉదయం సుమారు 11.30 గంటల సమయంలో మల్లేపల్లి శివారు నీచు గుండాల చెరువు గట్టు వద్ద మృతి చెంది ఉన్నట్టు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు తెలియజేశారు. మృతునికి తల్లి సాయమ్మ, భార్య దుర్గ, కూతురు సత్య, కొడుకు సాయి ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్టు గండేపల్లి హెచ్‌సీ రమణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం యల్లమిల్లికి చెందిన పత్తిపాటి శ్రీను(42) గత కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. అప్పటి నుంచి ఎన్ని మందులు వాడినప్పటికీ తగ్గకపోవడంతో మనస్థాపానికి గురై చనిపోవాలనే ఉద్దేశంతో జనవరి ఒకటిన క్రిమి సంహారక మందును సేవించాడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసపత్రికి తీసుకెళ్లారు. కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలియజేశారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

కొత్తపల్లి: పెట్రోలు బంకు యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ డీఎస్ఓ ప్రసన్న లక్ష్మి అన్నారు. కల్తీ డీజిల్ విక్రయిస్తున్నారని మత్స్యకారులు ఆందోళన చేయడంపై ఉప్పాడ–కోనపాపపేట బీచ్‌రోడ్డులో అమీనాబాద్ వద్ద ఉన్న శ్రీ రాఘవేంద్రా హెచ్‌పీ పెట్రోలు బంకును ఆదివారం అధికారులు తనిఖీ చేశారు. పెట్రోలు, డీజిల్ నిల్వ, వాటి రికార్డులు, నాణ్యతను పరిశీలించి కొలతలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు పత్రికలలో ప్రచురితమైన కథనాలతో ఈ పెట్రోలు బంకును తనిఖీ చేయడం జరిగిందన్నారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ఆమె వెంట మమత ఉన్నారు.